

తెగులు.. దిగులు..

- వరిలో ఎండు ఆకు తెగులు
- మొగి పురుగును మరువక ముందే మరో తెగులు
- రైతుల్లో ఆందోళన
- సస్యరక్షణ చర్యలు చేపడితే సత్ఫలితాలు

6

పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు

- పాఠశాల సిబ్బందిపై తల్లిదండ్రుల ఆగ్రహం

6



- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటున్న వైద్యులు

ప్రబలుతున్న జ్వరాలు

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు, పరిసరాల పరిశుభ్రత లోపించడం వల్ల విషజ్వరాలు ప్రబలు తున్నాయి. వారం రోజులుగా జిల్లాలో వర్షాలు కురు స్తున్నాయి. నివాస ప్రాంతాల్లో నీరు నిలిచింది.దోమలు విపరీతంగా పెరిగాయి. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే ఇంటింటి జ్వర సర్వే నిర్వహి స్తున్నది. ఇంట్లో ఎవరైనా జ్వరంతో బాదపడుతుంటే వారి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. జ్వరం మరీ ఎక్కువగా ఉంటే వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. వారి సర్వేలో ఎవరైనా విష జ్వరాలతో బాదపడుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత విభాగం వైద్యులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకొని, ఇతరులు దాని బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఆ కుటుంబానికి తగిన వైద్య సేవలు అందించడంతో పాటు తగిన సూచనలు చేస్తారు.

ఈ జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం

ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తోపాటు డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటుందని డాక్టర్లు తెలియజేస్తున్నారు. చిగున్ గున్యా కేసులు నమోదు కానప్పటికి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

పెరుగుతున్న ఓపీ సంఖ్య...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొద్ది రోజులుగా ఔట్ పేషంట్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ జ్వరాల బాధితుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో ఓపీ సంఖ్య రోజుకు వెయ్యికి పైగా ఉండేదని, ప్రస్తుతం రోజుకు 1,300 వరకు పెరిగిందని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ నవీన తెలిపారు.

జ్వరంతోపాటు కండరాల నొప్పులు...

డెంగ్యూ, చికున్ గున్యా వంటి విషజ్వరాలే కాకుండా వైరల్ ఫీవర్‌కు కండరాల నొప్పులు, గొంతులో నొప్పి, జలుబు, తలనొప్పితో బాధపడుతున్నట్లు

(మిగతా 8వ పేజీలో)

పెన్షన్ భిక్ష కాదు...ఉద్యోగుల హక్కు



కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేస్తున్న టీఎన్‌జీవో నాయకులు, పాల్గొన్న ఉద్యోగులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ భిక్ష కాదని, అది ఉద్యోగుల హక్కు అని టీజేఏసీ జిల్లా చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు, నల్ల దుస్తులు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ ఆర్థిక సహాయం కాదని, ఒక సాంఘిక భద్రత చర్య అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ఆ తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. కరోనా కాలంలో ప్రజలకు సేవలందించింది ఉద్యోగులేనని, వారిని కాపాడడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. దాచుకున్న డబ్బుల కోసం, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పదవీ విరమణ పొందిన తరువాత పెన్షన్ బిల్లుల కోసం, హెల్త్‌కార్డుల కోసం, పీఆర్సీ కోసం ఉద్యోగులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నేషన్ పద్ధతులు అమలు చేస్తూ ఉద్యోగులను అవమాన పరుస్తున్నారన్నారు. ఉద్యోగుల పనిగంటలతో సంబంధం లేకుండా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులు, జ్వరాలు, కరోనా సమయంలో, సంక్షేమ పథకాల అమలులో నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. అలాంటి ఉద్యోగులను గడియారాలతో కొలవడం అవమానించడమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, టీజీవో కార్యదర్శి అరవింద్‌రెడ్డి, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి ఎలదాసరి లింగయ్య, టీచర్ల సంఘం నాయకులు రఘుశంకర్‌రెడ్డి, రవీంద్రాచారి, కరుణాకర్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, ఇరుమల్ల శారద, సబితా, రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, రాజేశ్‌భరద్వాజ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, గోవిందపతి శ్రీనివాస్, అజ్గరుద్దీన్, రమేశ్, వెలిచాల సుమంత్‌రావు, కరుణాకర్, లవకుమార్, బైరి శ్రీనివాస్, రాజేశ్వరరావు, కమలాకర్, రాజేందర్, రాజు, కోట రామస్వామి, శంకర్, శ్రీనివాస్, హరిప్రియ, శైలజ, శారద, టీటీయూ నాయకులు ఆదర్శన్‌రెడ్డి, గంప చంద్రశేఖర్, ఈశ్వరయ్య, రామ్మోహన్, రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

- సగానికిపైగా వెలగని వీధి దీపాలు
- సామగ్రి లేక మరమ్మతుల్లో జాప్యం
- ఇబ్బందుల్లో నగరవాసులు

చీకట్లో కరీంనగర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో సగానికిపైగా కాలనీలు రాత్రి అయితే చాలు అంధకారంలో మగ్గుతున్నాయి. ఏడాది కాలంగా నగరపాలక సంస్థలో వీధి దీపాల నిర్వహణకు అవసరమయ్యే పరికరాలు, విడిభాగాలు లేకపోవడంతో చెడిపోయిన వీధి దీపాలను మరమ్మతు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదంటూ ప్రజలు నిత్యం ఫిర్యాదులు చేస్తూ ఉన్నారు.

విలీన గ్రామాలతో పెరిగిన విస్తీర్ణం

60 డివిజన్లతో కూడిన కరీంనగర్ నగరపాలక సంస్థలో సమీపంలోని కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు చింతకుంట, మల్కాపూర్, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలు విలీనమయ్యాయి. దీంతో నగరం విస్తీర్ణం పెరిగింది. విస్తీర్ణం మేరకు కొత్తగా వీధి దీపాలను హైమాస్ లైట్లను జంక్షన్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన పరికరాలు లేకపోవడంతో కొత్తగా వాటిని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఎక్కడైనా వెలగని వీధి దీపాలను, హైమాస్ట్ లైట్లను రిపేర్ చేసి వెలిగేలా చేసేందుకు పరికరాలు లేకపోడంతో అవి అలంకారప్రాయంగానే మిగులుతున్నాయి. ప్రస్తుతం నగరంలోని 600 మినీ హైమాస్ట్ లైట్లలో దాదాపు 40 శాతానికిపైగా వెలగడం లేదు. విలీన గ్రామాల్లో ఐదు వేలకుపైగా వీధి దీపాలు, కొత్తపల్లి మున్సిపాలిటీలో అక్కడక్కడ హైమాస్ట్ లైట్లు ఉండగా వాటిలో 20 శాతం వరకు వెలగడం లేదు. గతంలో ఓ కంపెనీ వీధి దీపాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతను చూసేది. ఆరు నెలల క్రితం ఆ కంపెనీ కంట్రాక్టు గడువు ముగియడంతో పరికరాలు రావడం లేదు. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వీధి దీపాలకు సంబంధించిన పరికరాల కోసం ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టును అప్పగించగారు. వారు సరఫరా చేస్తున్న పరికరాలు సరిపోవడం లేదు.



రాజీవ్‌చౌక్‌లో వెలగని హైమాస్ట్ లైట్

కొద్ది రోజులే స్మార్ట్ వెలుగులు

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆకర్షణీయమైన లైట్లను ఏర్పాటు చేసినా సదరు కాంట్రాక్టు సంస్థ నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో కొద్ది రోజులకే చెడిపోయాయి. వాటి మరమ్మతులకు అవసరమయ్యే పరికరాలు లేకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. అసంపూర్తిగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు పడుతున్న నగరవాసులు రాత్రి వేళల్లో వీధి దీపాలు లేక మరింత ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణ సరిగా జరిగేలా చూడాలని నగరవాసులు కోరుతున్నారు.

వరద సహాయక చర్యలు చేపట్టాలి

- వరద నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరద సహాయ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి భారీ వర్షాలు, వరద సహాయంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వరదల వల్ల మరమ్మతులకు గురైన పంచాయతీ రోడ్లు, రోడ్లు భవనాలశాఖ రోడ్ల డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద పునరుద్ధరణకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. విపత్తుల కారణంగా జరిగిన నష్టానికి అందించే పరిహారాన్ని చెల్లించేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు వినియోగించాలని సూచించారు. గతంలో వరదల సమయంలో చెడిపోయిన రోడ్ల మరమ్మతులకు ఖర్చు చేసిన నిధులు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద నమోదు చేస్తూ వివరాలు అందించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. ఆగస్టు నెలలో కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల ఎకరాల పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని, వీటికి పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఈ నెల 2 నుంచి 6 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచనల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. వరద సహాయక చర్యలకు కలెక్టర్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. వరదల నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, ఇతర పరికరాలు ఫీల్డ్‌లో సిద్ధం పెట్టుకోవాలన్నారు. వర్షాల సమయంలో విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి వరకు వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని, చనిపోయిన జంతువులకు కూడా పరిహారం ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, కిందస్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అందరు కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 269 దరఖాస్తులు



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 269 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబధిత అధికారులకు పంపి వాటిని సత్వరమే పరిష్క రించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. 15 సంవత్సరాలు నిండిన బాలికలు, 50 సంవత్సరాల పైన ఉన్న మహి ళలు, దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని డీఆర్డీవో, మెప్మా పీడీలను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో చదివే బాలికలను ఈ సంఘాల్లో చేరేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ప్ర భుత్వ పాఠశాలల్లో ముఖ గుర్తింపు హాజరును ఉపాధ్యాయుల సాదారణ సెలవులతో సోమవారం నుంచి లింక్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తనాజీ వాఖడే, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో యూరియా కోసం గొడుగులు పట్టుకొని బారులు తీరిన రైతులు



శంకరపట్నం మండలం ముత్తారంలో బారులు తీరిన మహిళలు



సైదాపూర్ మండలం వెన్నంపల్లి పీఏసీఎస్ వద్ద చెప్పులు లైన్లో పెట్టిన రైతులు

యూరియా తిప్పలు

జిల్లా వ్యాప్తంగా యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర యూరియా సరిపోవడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యూరియా లోడ్ వచ్చిందని తెలియగానే సహకార సంఘాలు, ప్రైవేట్ దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. గంటల తరబడి వేచి చూసి వారు ఇచ్చే ఒకటి, రెండు బస్తాలు తీసుకుని అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు.

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇబ్బందులు
- సహకార సంఘాల ఎదుట బారులు తీరుతున్న రైతులు

హుజూరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్‌లో యూరియా కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచే గ్రామాల నుంచి తరలివచ్చి ఎరువుల దుకాణాలు, సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట, వరంగల్ రోడ్‌లోని రెండు ఎరువుల దుకాణాలకు 600 బస్తాల యూరియా రాగా రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో వ్యవసాయాధికారులు పోలీసులను పిలిపించి ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

- శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి సహకార సంఘానికి 280 బస్తాలు వచ్చాయి. ఉదయాన్నే వర్షాన్ని కూడా లెక్క చేయకుండా రైతులు పెద్ద సంఖ్యలో గోదాం వద్దకు చేరుకున్నారు. సిబ్బంది, వ్యవసాయాధికారులు ఒక్కొక్కరికి ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. ముత్తారంలో 250 యూరియా బస్తాలు రాగా రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను లైన్‌లో నిలబెట్టారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు.

- మానకొండూర్: మండలంలోని మానకొండూర్, ఊటూర్ సహకార సంఘాలలో పరిధిలోని గ్రామాలలో రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. గంగిపల్లిలో 540, చెంజర్లలో 230, కొండపల్కలలో 230, వెల్దిలో 340, వేగురుపల్లిలో 340, ఊటూర్‌లో 230 బస్తాలు రాగా ఆయా గ్రామాల రైతులకు పంపిణీ చేశారు.ఒక్కొక్క రైతుకు రెండు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

- తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ ప్రాథమిక వ్యవసాయ కేంద్రానికి 450, మన్నెంపల్లి, తిమ్మాపూర్ గ్రామాలకు 170, పొలంపల్లికి 350 బస్తాల యూరియా ఆదివారం సాయంత్రం వచ్చింది. నుస్తులాపూర్ సొసైటీ వద్ద రైతులు ఆదివారం రాత్రి నుంచే యూరియా కోసం వేచి చూశారు. అర్ధరాత్రి నుంచి వర్షం కురిసినా రైతులు అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం అధికారులు యూరియా ఇచ్చేందుకు రావడంతో రైతులు ఎగబడ్డారు. పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణి చేశారు. తిమ్మాపూర్, మన్నెంపల్లిలో ఒక్కో గ్రామానికి 170 చొప్పున యూరియా బస్తాలు రావడంతో రైతుల వర్షంలో బారులు తీరారు. రైతుకు ఒక్క బస్తా ఇచ్చారు. పొలంపల్లిలో 350 బస్తాలు రావడంతో కొంత మంది రైతులకు మాత్రమే అందాయి.

- చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో రాయపట్నం రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి వంశీకృష్ణ, ఎస్‌ఐ నరేష్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి శాంతిం పజేశారు. చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సంఘం వద్ద యూ రియా బస్తాల రైతులు బారులుతీరారు. ప్రతి రైతుకు ఒకే బస్తా మాత్రమే ఇస్తా మని అధికారులు చెప్ప డంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

- చిగురుమామిడి: మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు కరీంనగర్- హుస్నాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాయికృష్ణ తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌కు సమాచారం అందించారు. దీంతో సీఐ మండల కేంద్రానికి వచ్చి రైతులతో మా ట్లాడి వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

- సైదాపూర్: మండలానికి యూరియా వస్తున్నదని తెలిసీ ఆయా సెంటర్ల వద్ద ఉదయం ఐదు గంటల నుంచే రైతులు బారులు తీరారు. వ్యవసాయాధికారులు, సిబ్బంది వచ్చి రైతులకు టోకెన్లు ఇచ్చారు. మండలానికి సోమవారం సుమారు వెయ్యి బస్తాల వచ్చింది గొడిశాలకు 170, ఆకునూర్‌కు 170, సైదాపూర్‌కు 170, వెన్కేపల్లికి 230, వెన్నంపల్లికి 230 బస్తాల యూరియా వచ్చింది.



చిగురుమామిడిలో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు



చొప్పదండి ప్యాక్స్ ఎదుట బారులు తీరిన రైతులు



మానకొండూర్ మండలం గంగిపల్లిలో క్యూలో నిల్చున్న రైతులు



తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సొసైటీ వద్ద వర్షంలో బారులు తీరిన రైతులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన వాహన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పర్చడంతో న్యాయమూర్తి 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారని తెలిపారు. రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాడని చెప్పారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వఅనుమతి లేకుండా ఇసుకతరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎం.రాజశేఖర్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల వద్ద నుంచి 41,360 రూపాయల నగదు, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ఓదెల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక శివారులో రజకుల ఆరాధ్యదైవం మడేలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ఇందిరమ్మ చెరువు సమీపంలో ఉన్న మడేలేశ్వర స్వామి ఆలయ తలుపులను ధ్వంసం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఆలయంలోని ఇత్తడి దీపాలు, గంటను దొంగిలించారని, అలాగే గుడిలోని విద్యుత్ బోర్డును ధ్వంసం చేశారని, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘం నాయకులు పోలీస్ అధికారులను కోరారు.

కోతుల దాడిలో గాయాలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నీరుకుళ్ల గ్రామానికి చెందిన గుడ్ల శ్రీనివాస్ అనేవ్యక్తి కోతుల దాడిలో గాయపడ్డాడు. శ్రీనివాస్ సుల్తానాబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రోడ్డు వెంట వెలుతుంటే ఓ పాపపై కోతుల దాడిని తప్పించాడు. అంతలోనే కోతులు మంద శ్రీనివాస్‌పై దాడిచేసి గాయపరిచాయి. వెంటనే అతన్ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తెగులు..దిగులు..



- వరిలో ఎండు ఆకు తెగులు
- మొగి పురుగును మరువక ముందే మరో తెగులు
- రైతుల్లో ఆందోళన
- సస్యరక్షణ చర్యలు చేపడితే సత్ఫలితాలు

చొప్పదండి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు సోకుతోంది. ప్రస్తుతం వరిపైరు పిలకలు తొడిగే దశలో ఉండగా ఎండు ఆకు తెగులు సరికొత్త సమస్యగా మారింది. నాలుగేళ్లుగా వరిపంటను మొగిపురుగు దెబ్బతీయగా దానిని మరువకముందే మరో తెగులు వరికి సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చొప్పదండి మండలంలో దాదాపు 15వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో నాటు వేసిన రైతుల పంటపొలాల్లో ఈ బ్యాక్టీరియా ఎండుఆకు తెగులు సోకుతోంది. పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి క్రమం తప్పకుండా క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తేనే ఫలితం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

వాతావరణ మార్పులతో సమస్య..

పది రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతోపాటు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు వరికి సోకినట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. వరి ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, మచ్చలుగా మారి కిందివరకు బ్యాక్టీరియా వ్యాపిస్తోంది. ఫలితంగా ఆకు ఎండిపోతోంది. పసుపు పచ్చని జిగురు వంటి బ్యాక్టీరియా ఆకులపై ఉంటోంది.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

ఆకు తెగులు ప్రారంభం కాగానే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. యూరియా వాడకాన్ని నిలిపివేసి పొలంలోని మొత్తం నీటిని కాల్వల ద్వారా తీసివేయాలి. రైతులు పొలాన్ని ప్రతి నిత్యం గమనిస్తూ ఉండాలి. తెగులు సోకిన పొలం నుంచి ఇతర పొలాల్లోకి నీరు పారకుండా చూడాలి.

పొటాష్ ఎరువును ఆఖరి దఫాలో తప్పనిసరిగా వరికి వేయాలి. తెగులు పై రైతులకు అవగాహన లేనిపక్షంలో వెంటనే మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేకపోగా సరైన సమయంలో వరిపొలంలో తెగులు లక్షణాలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి..

వంశీకృష్ణ, వ్యవసాయ అధికారి, చొప్పదండి



బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు వ్యాప్తిని అరికట్టడానికి రైతులు సస్యరక్షణ చర్యలను చేపట్టాలి. పొలంలో వీలైనంత మేరకు నీటిని తీసివేసి ఆరబెట్టాలి. పోషకాలకు సంబంధించిన మందులను స్ప్రే చేసుకోవాలి. పొలంలో పాకురు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు బాలుర నుంచి 22.71 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గత నెల 30న కోలేటి మల్లికార్జున్ అనే వ్యాపారి ఇంటిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈకేసులో నిందితులైన ఇద్దరు బాలుర నుంచి22.71తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను జగిత్యాల జువైనల్ జస్టిస్‌బోర్డు ఎదుట హాజరుపరచారు. సోమవారం ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. ఆగస్టు 30 న ధర్మపురి పట్టణంలో కోలేటి మల్లికార్జున్ అనే వ్యాపారి ఉదయం తన ఇంటికి తాళం వేసి బట్టల షాపుకు వెళ్లాడు. అదేరోజు రాత్రి ఇంటికి వెళ్లి చూసే సరికి తాళాలు పగులగొట్టి బీరువా తెరచి అందులో ఉన్న 22.71తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలి యని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేయగా సీఐ రాం నర్సింహారెడ్డి విచారణ చేపట్టారు. సీసీటీవీల ఆధారంగా నిందితుల కోసం వెతకగా కోలేటి మల్లికార్జున్ ఇంటిలో దొంగతనం చేసింది ఇద్దరు బాలురు (అన్నదమ్ములు)గా గుర్తించారు. నిందితులైన బాలురను ఉదయం వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తక్షణమే స్పందించి కేసును ఛేదించిన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవీందర్‌కుమార్, పీసీలు రమేష్‌నాయక్, రణధీర్‌గౌడ్, రమేష్, రామస్వామి, ఆరిఫ్, మహేందర్‌లను జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

కోతుల దాడిలో పత్తి పంట ధ్వంసం

కోనరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన దొడ్డ చంద్రయ్య అనే రైతుకు చెందిన పత్తి పంట కోతులు దాడిచేసి ధ్వంసం చేశాయి. గ్రామ శివారులో ఉన్న పత్తి కాయలను తెంపి తిని పడేస్తూ ధ్వంసం చేశాయి. దీంతో 20గుంటల్లో పత్తి పంట ధ్వంసమైనట్లు తెలిపారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.



ధ్వంసమైన పత్తి పంట

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

బోయినపల్లి సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని మిడ్‌మానేరు వద్ద బీఆర్ఎస్ జిల్లా పార్టీఆధ్వర్యంలో జలభిషేకం నిర్వహించారు. గంభీరావుపేట మండలానికి చెందిన లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడన్నారు. ఈ మేరకు కమలాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, నాగుల వంశీ, జంగం అంజయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సై రమాకాంత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మేరకు కమలాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చేపల వేటకు వెళ్లి మృత్యు ఒడిలోకి

ధర్మారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్‌తో చేపల వేట కోసం వెళ్లిన వ్యక్తి పొరపాటున అదే విద్యుత్ వైర్‌షాక్‌కు ప్రాణాలు కోల్పోయిన సంఘటన ధర్మారం మండలం గోపాల్‌రావుపేటలో చోటు చేసుకుంది. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మేకల రవి(50) ఆదివారం సాయంత్రం గ్రామశివారులోని వాగు మత్తడిదగ్గర చేపల వేటకు వెళ్లాడు. సమీపంలోని పంపుసెట్ స్టాటర్ బాక్స్ నుంచి కనెక్షన్ ఇచ్చి చేపలు పట్టేక్రమంలో పొరపాటున రవి కాలు వైరుకు తగికి విద్యుత్‌షాక్‌తో వాగులో పడి మృతిచెందాడు. సోమవారం ఉదయం గ్రామానికిచెందిన వ్యక్తిఅటుగా వెళ్తుండగా రవి మృతి విషయం తెలిసింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రవి భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.



మేకల రవి(ఫైల్)

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామంలో సోమవారం పెంట రాజవ్వ(69) అనే మహిళారైతు విద్యుదాఘాతంతో మృతి చెందింది. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజవ్వ గ్రామ శివారులోగల తన మక్కచేను కాపలాకు మధ్యాహ్నం వెళ్లింది. చేనులో తెగిపడిన విద్యుత్‌వైరును గమనించక దానిపై అడుగు వేసింది. దీంతో విద్యుదాఘాతంతో రాజవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. రాజవ్వ కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.



రాజవ్వ(ఫైల్)

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని బెండపల్లికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా(45)అనే యువకుడు మద్యానికి బానిసై సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కోరుట్ల రెండవ ఎస్ఐ రామచంద్రుడు తెలిపారు. చాంద్‌పాషా పట్టణంలోని శ్రీకృష్ణుడి దేవాలయ సమీపంలో పాన్ టేలా నడిపేవాడు. చాంద్‌పాషాకు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదం చోటుచేసుకోగా ఇంట్లోనే ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చాంద్‌పాషా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. భార్య కైర్ ఉనిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వర్షానికి తెగిన రోడ్డు

రాయికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజనగరం ఎస్సీకాలనీ నుంచి తండాకు వెళ్లే రోడ్డు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.



తెగిపోయిన రోడ్డు

సమయానికి బస్సు నడపాలని విద్యార్థుల ధర్నా



వెంకట్రావుపేటలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

భీమారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమయపాలన లేకుండా ఆర్టీసీ బస్సు నడపుతున్నారని భీమారం మండలం వెంకట్రావుపేటలో విద్యార్థులు సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సాయంత్రం రావాల్సిన బస్సు రాత్రి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సమయానికి వచ్చేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధర్మపురిలో భాగవత సప్తాహం ప్రారంభం

ధర్మపురి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో భాగవత సప్తాహం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదట భాగవత గ్రంథానికి పూజచేసిన అనంతరం మహేశ్వరశర్మ ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా పురాణం మహేశ్వర్ శర్మను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు కలిసి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మన్ జక్కురవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్, శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మద్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి శోభ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రవచనాలు చేస్తున్న బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వరశర్మ

ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన కేసులో ఒకరికి జైలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న కానిస్టేబుల్‌ను ఉద్దేశపూర్వకంగా ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన కేసులో ఒకరికి నెల రోజుల జైలుశిక్షతో పాటు వెయ్యిరూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్‌జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్యశర్మ సోమవారం తీర్పునిచ్చారు. 2021 డిసెంబర్30న సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామ శివారులో అనీఫొద్దీన్ అనే కానిస్టేబుల్ తోటిఉద్యోగులతో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ వాహనతనిఖీల్లో పాల్గొన్నాడు. పెంబట్ల గ్రామానికి చెందిన సురేష్‌అనేవ్యక్తి ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతూ విధులు నిర్వహిస్తున్న అనీఫొద్దీన్ అనే కానిస్టేబుల్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన కానిస్టేబుల్ ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్ సాక్ష్యులను ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సురేష్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చోరీ కేసుల్లో ఒకరికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డ ఒకరికి ఐదు నెలల జైలు శిక్షతో పాటు రూ2 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిజ కోహిర్‌కార్ సోమవారం తీర్పునిచ్చారు. జిల్లాకేంద్రంలోని టీట్ బజార్ ప్రాంతంలోని ఓమెడికల్ షాప్‌తో పాటు మరోఇంటిలో 2020 సంవత్సరంలో కరణ్‌సింగ్ గగన్ అనేవ్యక్తి చోరీకి పాల్పడి నగదుతోపాటు విలువైన వస్తువులు అపహరించుకు వెళ్లాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐలు జయేష్‌రెడ్డి, వేణు గోపాల్‌లు కేసు నమోదు చేశారు. విచారణలో మహారాష్ట్రలోని కోత్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన కరణ్‌సింగ్ గగన్ అనేవ్యక్తి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు సాక్ష్యులను ప్రవేశపెట్టగా అదనపు పీపీ రాజేష్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి కరణ్‌సింగ్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

అధికారులు వేధిస్తున్నారని ఫైర్‌మన్ ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న జి మనోహర్ సోమవారం గడ్డిమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఫైర్ స్టేషన్ అధికారులు డ్యూటీవిషయంలో తనను వేధింపులకు గురిచేస్తున్నారని సూసైడ్ లెటర్ రాశాడు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన మనోహర్ చొప్పదండి ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఫైర్‌స్టేషన్ అధికారులు పవన్, కిషన్ తన వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ కించపరుస్తున్నారని, తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని లెటర్‌లో పేర్కొన్నాడు. ఈ ఇబ్బందుల కారణంగా తాను చనిపోవాలని నిర్ణయించుకున్నానని తెలిపాడు. అనంతరం కరీంనగర్ సమీపంలోని ఇరుకుల్ల వద్ద గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని తన స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. స్నేహితులు, కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకొని మనోహర్‌ను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మనోహర్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, విచారణ జరుపుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఫైర్‌మన్ మనోహర్



దిగువకు ప్రవహిస్తున్న ఎగువ మానేరు

కొనసాగుతున్న ఎగువ మానేరు పరవళ్లు

గంభీరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయం పరవళ్లు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మానేరు ప్రాజెక్టు ఉప్పొంగింది. మానేరు అవుట్ ఫ్లో, ఇన్‌ఫ్లో 85వేల క్యూసెక్కుల వరకు వెళ్లి, ప్రస్తుతం 3,823 క్యూసెక్కులకు చేరింది. మానేరు ఉధృతి కారణంగా గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య వాగులో వేసిన మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది.

ఎంజేపీ పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు

హుజూరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం కేసీ క్యాంపులోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు ఆధ్వర్యంలో సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మూడ్రోజులుగా ఇద్దరు విద్యార్థునులను ఎలుకలు కరవగా, గుట్టుచప్పుడు కాకుండా ప్రిన్సిపాల్ వైద్యం చేయించారని ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకుల పాఠశాల సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థినుల తల్లిదండ్రులను లోపలికి రాకుండా పాఠశాల గేట్‌కు తాళం వేయడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని మిగితా విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. విషయం తెలుసుకున్న రీజినల్ కో-ఆర్డినేటర్ అంజలీదేవి, ఎంఈవో శ్రీనివాస్ హాస్టల్‌ను పరిశీలించి, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఎంజేపీ పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆరా తీసినట్లు తెలిసింది.



హుజూరాబాద్ ఎంజేపీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

స్వాతంత్ర్య సమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య మృతి

- నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం

మంథని, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిజాంస్టేట్‌ను ఇండియన్ యూనియన్‌లో విలీనంకోసం సాగిన సాయుధపోరాటంలో పాల్గొన్న మంథనికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య(92) హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి మృతిచెందారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధపోరాటం చేసిన మంథనికిచెందిన గొలుకోట శ్రీరాములు బృందంలో రాంపెల్లి కిష్టయ్య పాల్గొన్నారు. మహారాష్ట్రలోని చందా(చంద్రాపూర్)లో ఇండియన్ ఆర్మీ వద్ద కిష్టయ్య ఆయుధాల వినియోగం, యుద్ధంలో శిక్షణ పొందారు. అనంతరం వారి బృందం గోదావరినది పరివాహక ప్రాంతంలోని కాళేశ్వరం, దామెరకుంటలో నిజాం పోలీసుస్టేషన్లపై దాడి చేసింది. నిజాంపాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేశారు. అనేకపోరాటాల తర్వాత ఇండియన్ యూనియన్‌లో నిజాంస్టేట్ విలీనమైంది.



రాంపెల్లి కిష్టయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో

అనంతరం రాంపెల్లి కిష్టయ్య టీచర్‌గా, హెచ్ఎంగా పనిచేసి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఇన్ స్కూల్స్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మాజీగవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్రఐటీశాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కిష్టయ్యను సన్మానించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా అనేక పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న రాంపెల్లి కిష్టయ్య తుదిశ్వాస విడిచారు. మంథనిలో ఆయన నివాసానికి పార్థివ దేహాన్ని తీసుకువచ్చి జాతీయ జెండాను కప్పారు. మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి, ఈఆర్‌సీ మెంబర్ శశిభూషణ్ కాచేతోపాటు పలువురు నివాళులర్పించారు. మంథని గోదావరినది తీరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

- రాంపెల్లి కిష్టయ్య మృతి చాలా బాధాకరం

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నిజాం పాలకు వ్యతిరేకంగా సాయుధంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య మృతి బాధాకరమని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని ప్రకటించారు.

హరీశ్‌రావు, సంతోష్‌రావు
అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఈ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్దసారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత
సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌ‌స్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే ముందుముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

రిజిస్టర్ పోస్టుకు సెలవు

స్పీడ్ పోస్టులో విలీనం



భగత్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రిజిస్టర్ పోస్టు సేవలకు తపాలా శాఖ సెలవు పలికింది. సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ కీలకనిర్ణయం తీసుకుంది. పెరిగిపోతున్న సాంకేతిక తను తపాల శాఖఅందిపుచ్చుకుని తపాల సేవల్లో పలు మార్పులను తీసుకు వచ్చింది.

తపాలా సేవల్లో మార్పులు

పెరిగిపోతున్న సాంకేతికను తపాల శాఖ అందిపుచ్చుకుని తపాలా సేవల్లో పలు మార్పులు వచ్చాయి. ఒక నాడు ఉత్తరాల బట్వాడాకు, మనీ ఆర్డర్లు పంపేందుకు, పొదుపు పథకాలు అందిచేందుకు ప్రధాన కేంద్రాలుగా పోస్టాఫీసులు ఉండేవి. నేడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు సేకరిస్తూ, బీమాపాలసీలు అందిస్తూ బ్యాంకులుగా రూపాంతరం చెందాయి. ప్రజలు అందివచ్చిన టెక్నాలజీకి అలవాటు పడ్డారు. సెల్‌ఫోన్ల వినియోగం పెరగడంతో ఉత్తరాలు కనుమరుగయ్యాయి. పార్శిళ్లు వంటివి పంపాలంటే ప్రైవేట్ కొరియర్ సంస్థలు అందుబాటులోకి వచ్చాయి.

కనుమరుగుకానున్న పోస్ట్ బాక్స్‌లు

పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టుది సుదీర్ఘ చరిత్ర. 1854 సంవత్సరంలో బ్రిటిష్ కాలంలో మన దేశంలోకి ప్రవేశపెట్టిన పోస్టుబాక్సులు ఇకపై కనుమరుగుకానున్నాయి. బంధువులు, స్నేహితులకు రాసిన ఉత్తరాలు, గ్రీటింగ్ కార్డ్స్ అభిమాన రచయితలు, సినీతారలకు రాసిన లెటర్స్‌తో పాటు ఊరు పేరు లేకుండా రాసే ఆకాశరామన్న ఉత్తరాలు పోస్టుబాక్సుల్లో వేస్తే అవి చేరాల్సిన చోటుకు చేరేవి. పెరుగుతున్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఖర్చులు తగ్గించుకునే చర్యలో భాగంగా పోస్టుబాక్సులు తొలగించనున్నారు. కొంత కాలంగా ఇంటర్నెట్, డిజిటల్ కమ్యూనికేషన్ల వల్ల సాధారణ రిజిస్టర్ పోస్టులు, పోస్టు బాక్సుల ఉపయోగం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో దేశ్యాప్తంగా సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్టు సేవలు నిలిపివేశారు. ట్రాకింగ్‌లో కచ్చితత్వాన్ని, డెలివరీ వేగాన్ని, ఆపరేషనల్ ఎఫిషియన్సీని మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తపాలా శాఖ అధికారులు తెలిపారు.

7న ఆలయాలు మూసివేత

ధర్మపురి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు ఈనెల 7న చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేస్తామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారలకు నివేదన అనంతరం ఒంటి గంటకు ఆలయాలు మూసి వేసి సోమవారం ఉదయం 5 గంటలకు తెరవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయాల్లో సంప్రోక్షణ, గ్రహణ శాంతి, హోమం, అభిషేకం అనంతరం ఉదయం 9.30 గంటలకు భక్తులకు దర్శనం ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



ఉత్తర తెలంగాణకు ప్రాణవాయువు
శ్రీపాద ఎల్లంపల్లి

కాళేశ్వరం అవసరం లేకుండానే నీటి ఎత్తిపోతలు

- గతేడాది 24.193 టీఎంసీలు, ఈ ఏడాది 7.197 టీఎంసీలు
- ప్రత్యామ్నాయం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం

పెద్దపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రాణవాయువుగా మారింది. ఉత్తర తెలంగాణలోని 13 జిల్లాల్లోని సాగు భూములను సస్యశ్యామలం చేసేందుకు జంక్షన్‌గా నిలిచింది. గత ఏడాది ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల సూచనల మేరకు కాళేశ్వరం బ్యారేజీలను ఓపెన్ ఫ్రీగా పెట్టగా, అక్కడి నుంచి నీటిని ఎత్తి పోయకుండానే గతేడాది రెండు పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని అవసరం మేరకు మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. శ్రీపాద ఎల్లంపల్లికి ఈ ఏడాది జూన్ 1వ తేదీ నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను, 8.593 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

అప్పటి నుంచి శనివారం ఉదయం వరకు ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 256 టీఎంసీల వరద నీరు వచ్చింది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా 7.197 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు. 244.43 టీఎంసీల నీటిని గోదావరిలోకి గేట్ల ద్వారా వదిలి పెట్టారు. ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోపాటు ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా, ఎల్లంపల్లి నుంచి వచ్చిన నీళ్ల ద్వారా 24 టీఎంసీలకు చేరుకున్నది. ఇక్కడి నుంచి రంగనాయకసాగర్‌కు, ఎల్ఎండీలకు నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరుకు వరద నీరు, ఎస్సారెస్పీ నీళ్లు వస్తుండడంతో మూడు రోజుల క్రితమే మోటార్లను ఆపేసి ఎత్తిపోతలను నిలిపి వేశారు. గతేడాది శ్రీపాద ఎల్లంపల్లికి 303 టీఎంసీల వరకు వరద రాగా, 24.193 టీఎంసీల నీటిని నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా మిడ్ మానేరుకు తరలించారు. దిగువకు గోదావరిలోకి 278.24 టీఎంసీల నీటిని వదిలిపెట్టారు. ఈ ఏడాది కూడా కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోయకుండానే అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్ల కింద ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటలు పండించేందుకు ఢోకా లేకుండా పోయింది.

సీజన్ ప్రారంభం, చివరలోనే ఉపయోగం..

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తి పోసిన నీళ్లు వానాకాలం సీజన్ ప్రారంభంలో, ఆ తర్వాత వేసవి కాలంలో పంటలు చేతికి వచ్చే సమయంలో ఉపయోగపడ్డాయి. గోదావరి తీర ప్రాంతంలో యేటా భారీ వర్షాలు జూలై నెలాఖరులో ఆరంభమై ఆగస్టు, సెప్టెంబర్ వరకు కురుస్తాయి. ఈ క్రమంలో జూన్, జూలై మొదటి వారంలో కాళేశ్వరం ప్రాజెక్టులోకి నీటిని ఎత్తుపోశారు. వర్షాల పరిస్థితిని అంచనా వేస్తూ నీటిని ఎత్తిపోశారు. ప్రాజెక్టు డీపీఆర్ ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు ఆరంభించిన నాటి నుంచి 160 టీఎంసీల నీటిని ఎత్తిపోసిన దాఖలాలు లేవు. నాలుగేళ్లలో మొత్తం 163 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. కాళేశ్వరంతో సంబంధం లేకుండా గతేడాది 24.193 టీఎంసీలు, ఈ ఏడాది ఇప్పటి వరకు 7.197 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీ నిండుతుండగా, అవసరాన్ని బట్టి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు, ఎల్ఎండీకి నీటిని విడుదల చేస్తున్నారు. మిడ్ మానేరు, ఎల్ఎండీల ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాల వల్ల కూడా కొంత నీరు వస్తున్నది. వీటికి తోడు ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు ఉపయోగపడుతున్నాయి.

● తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మిస్తేనే మేలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మేరకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మించడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వానికి విద్యుత్ బిల్లులు ఆదా కానున్నాయి. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా సముద్రమట్టానికి 143 అడుగుల ఎత్తులో ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ప్రాణహితకు వచ్చిన వరదను వచ్చినట్లే తరలించవచ్చు. గతంలోనే తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వరకు కాలువల నిర్మాణాలు పూర్తయ్యాయి. సముద్రమట్టానికి 152 అడుగుల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ, మహారాష్ట్రలో ముంపు ఎక్కువగా ఉండడంతో అందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించ లేదు. తెలంగాణ వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తుమ్మిడిహెట్టి వద్ద 148 అడుగులు, మేడిగడ్డ వద్ద 100 అడుగుల ఎత్తులో బ్యారేజీ నిర్మాణాలు చేపట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ప్రస్తుతం కాళేశ్వరం బ్యారేజీలు కుంగినందున ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మిస్తేనే రైతాంగానికి మేలు జరగనున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే వీలు ఉంటుంది. దీనికి తోడు పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం పత్తిపాక వద్ద ప్రతిపాదించిన శ్రీలక్ష్మి నర్సింహా రిజర్వాయర్ డీపీఆర్ తయారీకి ఆదేశించిన ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడితే పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఎస్సారెస్పీ కింద గల 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు భూములను స్థిరీకరించడంతో పాటు, నీటి నిల్వ కూడా చేసుకునే వెసలుబాటు ఉంటుంది. సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంలో గల లోపాలను గుర్తించి దానికి మరమ్మతు చేసి డీపీఆర్ లో ప్రతిపాదించిన మేరకు మంథని నియోజకవర్గానికి 30 వేల ఎకరాలకు, చెన్నూర్ నియోజకవర్గంలోని 25 వేల ఎకరాలకు సాగు నీటిని ఇవ్వవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



● కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నాలుగేళ్లలో 163 టీఎంసీలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టుకు 2009లో శ్రీకారం చుట్టారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మించి 160 టీఎంసీలను ఎత్తిపోసి 16.40 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీటిని అందించాలని తలపెట్టారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 36,500 కోట్లు కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి 1500 కోట్ల రూపాయలు వెచ్చించి ఆయా ప్రాంతాల్లో సొరంగ మార్గాలు, కాలువల నిర్మాణాలు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత- చేవేళ్లకు ప్రాజెక్టుకు రీ డిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా యేటా 160 టీఎంసీల నీటిని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వరకు ఎత్తి పోసి 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు, 18,82,970 ఎకరాల భూములను స్థిరీకరించేందుకు 2016 మే 2న కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు మేడిగడ్డ వద్ద శ్రీకారం చుట్టారు. గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు, మూడు పంప్‌హౌస్‌లు నిర్మించారు. 2019 జూన్ 21న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సీఎంలతో కలిసి ప్రాజెక్టును ఆరంభించి జాతికి అంకితం చేశారు.

అదే ఏడాది ఆగస్టు 5వ తేదీ వరకు క్రమంగా మూడు పంప్‌హౌస్‌ల ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోశారు. 2019-20లో 53 టీఎంసీలు, 2020-21లో 48 టీఎంసీలు, 2021- 22లో 33 టీఎంసీలు, 2023లో 26 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అదే ఏడాది అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీకి చెందిన రెండు పియర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీకి బుంగ పడింది. సుందిళ్ల బ్యారేజీలు స్వీపేజీలు ఏర్పడ్డాయి. దీంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు వాటిని పరిశీలించి ఓపెన్ ఫ్రీ బ్యారేజీలుగా ఉంచాలని సూచించారు. ఆ మేరకు ప్రభుత్వం గతేడాది నుంచి నీటిని నిల్వ చేయడం లేదు. 2019 నుంచి 20 23 వరకు నాలుగేళ్లలో 163 టీఎంసీల నీటిని ఎత్తిపోసినప్పటికీ, ఎల్లంపల్లి నుంచి దిగువకు గోదావరిలోకి 1165 టీఎంసీల నీటిని వదిలిపెట్టారు.

శ్రీరాంసాగర్‌కు 1.30 లక్షల క్యూసెక్కుల వరద

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 25 గేట్లు పైకి ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 76.984 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఆదివారం 14,800 క్యూ సెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.35 మీటర్లు ఉన్నది. నిల్వ సామర్థ్యం 27.888 టీఎంసీలకు 25.527 టీఎంసీల నీరు ఉన్నది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు నాలుగు పంపుల ద్వారా కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.82టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 12,800క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 9,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో



కళకళలాడుతున్న ఎల్ఎండీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ కాకతీయ కాలువ నుంచి 2వేల క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 1148 క్యూసెక్కుల నీరు మొ త్తంగా 3148 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఎల్ఎండీలోకి వస్తోం ది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 21.505 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాల కోసం 301 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

● సంక్షిప్తంగా..

భగత్‌నగర్: బీజేపీ నాయకుడు, ఏడవ డివిజన్ హౌసింగ్ బోర్డుకాలనీకి చెందిన తోట సాగర్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం ఫోన్‌లో పరామర్శించారు.

సుభాష్‌నగర్: రామడుగు మండలం వెదిరకు అనుబందంగా కోనరావుపేటలోని ఎస్సీ కాలనీలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు వెన్న రాజమల్లయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ కల్చరల్: లీడ్‌ఇండియా నేషనల్ క్లబ్, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ లేఖా రచన దినోత్సవం నిర్వహించారు.

- నగరంలోని శ్రీపురంకాలనీ వినాయక మండపంలో విఘ్నేశ్వరునికి కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు బొమ్మకల్ మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌తో కలిసి పూజలు నిర్వహించారు.

- నగరంలోని శ్రీరామ్ నగర్‌కాలనీ శ్రీరామమందిరంలో వినాయకుని సన్నిధిలో సామూహిక కుంకు మార్చనలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు మాధవరావు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్లలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో అగ్రోస్ కంపెనీ ఆధ్వర్యంలో నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు.

సుభాష్‌నగర్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

గణేశ్‌నగర్: కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశానుసారం పారామిత హెరిటేజ్ స్కూల్ ఆధ్వర్యంలో ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో చేతిరాత పోటీలను నిర్వహించారు.

భగత్‌నగర్: నగరంలో సీఐటీయూ అనుబంధంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంగోని జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగిన 9వ మహాసభలు సోమవారం ముగిశాయి.

చొప్పదండి: పట్టణంలోని 9వ వార్డులో సీఎస్ఐ చర్చికి వెళ్లే రోడ్డు వద్ద సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణపనులు అర్థాంతరంగా నిలిపివేశారని మల్లారపు రాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

గంగాధర: విద్యార్థులు చదువుతో పాటుక్రీడల్లో రాణించాలని గంగాధర మాజీ ఉపసర్పంచ్ గాలిపెల్లి నాగలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. సోమవారం గంగాధర జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులకు షూ అందించారు.

గంగాధర/రామడుగు: గంగాధర మండలం గోపాల్‌రావుపల్లి, రామడుగులో వినాయక మండపాల వద్ద కుంకుమ పూజలు, అన్నదానాలు నిర్వహించారు.

గంగాధర: మండలంలో సోమవారం భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తహసీల్దార్ కార్యాలయంలో పలు వురు రిజిస్ట్రేషన్లకు స్లాట్‌ను బుక్ చేసుకున్నారు. అయితే తహసీల్దార్ రజిత సోమవారం సెలవుల్లో ఉన్నారు. మరోవైపు డీటీ కరీంనగర్ ప్రజావాణికి వెళ్లారు.

సైదాపూర్: ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దుచేయాలని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ఇల్లందకుంట : కరీంనగర్‌లో రేపు జరిగే బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ అన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఈనెల 3నుంచి 6వరకు మండలస్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి చిరుత శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

వీణవంక: నర్సింగాపూర్ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో గణపతికి 108 ప్రసాదలతో నైవేద్యం సమర్పించారు.

భగత్‌నగర్: నగరంలోని జ్యోతినగర్‌లో నూతనంగా సాయిశ్రీ లయన్స్‌క్లబ్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. క్లబ్ ఎక్స్‌టెన్షన్ ఛైర్మన్ ఊకంటి సంపతికుమారి ఆధ్వర్యంలో నూతన క్లబ్ అధ్యక్షురాలు స్వాతిరెడ్డి, కార్యదర్శి రజితరెడ్డి, కోశాధికారి పాతదీపికతో గవర్నర్ సింహరాజు కోదండరాం ప్రమాణ స్వీకారం చేయించారు.

సుభాష్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ బోగె పద్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

పీహెచ్‌సీని ప్రభుత్వ భవనంలోకి మార్చాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అద్దెభవనంలో కొనసాగిస్తున్న సప్తగిరి కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ భవనంలోకి మర్చాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ పాఠశాలలను ఖాళీగా ఉన్న స్థానిక ప్రభుత్వ భవనాల్లోకి మార్చడంలో భాగంగా సప్తగిరి కాలనీలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని ఆధునీకరించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్‌తో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునీకరణ పూర్తైనందున ఆరోగ్య కేంద్రాన్ని మార్చాలన్నారు.

నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం పరిశీలించారు. పనులకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ అండర్-14, 17 క్రీడోత్సవాలు సోమవారం సప్తగిరికాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం నిర్వహించిన వాలీబాల్ పోటీలను తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, కరీంనగర్ అర్బన్ కార్యదర్శి అంతటి శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్ రెడ్డి, ఉపాధ్యాయులు గాజుల రవీందర్, ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌గౌడ్, దారం శ్రీనివాస్ రెడ్డి, గౌరవాధ్యక్షులు సిలివేరి మహేందర్, సీనియర్ పీడీలు, పీఈటీలు దివాకర్, శ్రీనివాస్, శ్రీదర్ రెడ్డి, లింగారావు, చిరంజీవి, మధునయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు, రూరల్ ఏడీఈ ఎం. లావణ్య, గాదం రఘు ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు అంజనాద్రి ఆలయం, పొన్నం కనకయ్య హోటల్, రాంచంద్రపూర్ కాలనీలో కొంతభాగం, సాయిబాబా ఆలయం, అంజనాద్రి కాలనీ రోడ్ నంబరు 1,2,3,4,5,6, ప్రాంతాలు. కమారపు లక్ష్మి అపార్ట్‌మెంట్, ఎలైట్‌ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్, లహరి అపార్ట్‌మెంట్, శ్రీకన్వెన్షన్, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 3:30 వరకు చింతకుంట, కమాన్‌పూర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చేతిరాత పోటీల ఫలితాలు విడుదల

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పారమిత విద్యాసంస్థల సహకారంతో నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లాస్థాయి చేతిరాత పోటీల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముందుగా మండలస్థాయి చేతిరాత పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థుల జాబితాను కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని 16 మండలాల నుంచి మొత్తం 584 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతి మండలం నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున మొత్తం 48 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 7న పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ప్రసాదరావు అభినందించారు. పాఠశాల డైరెక్టర్ హన్మంతరావు, చేతిరాత నిపుణుడు దిడ్డి అభినవ్ పాల్గొన్నారు.

6 నుంచి మానేరులో కబడ్డీ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కదారి అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో ఈ నెల 6 నుంచి 8 వరకు పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాల ఆవరణలో కరీంనగర్ అర్బన్ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు మానేరు విద్యాసంస్థల అధినేత, ఒలింపిక్ సంఘం ప్యాట్రన్ కదారి అనంతరెడ్డి తెలిపారు. సోమవారం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఒలంపిక్, ఎస్‌జీఎఫ్ బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు. మానేరు విద్యాసంస్థలు క్రీడల నిర్వహణకు ముందుంటాయన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి,జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, కరీంనగర్ అర్బన్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అంతటి శంకరయ్య, పాఠశాల పీఈటీ మహేందర్ పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ జాబితాపై బీజేపీ ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కరీంనగర్ రూరల్ , సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్‌తోపాటు ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ, మాజీ సర్పంచ్ పురమల్ల లలితా పేర్లు బొమ్మకల్, ఇరుకుల్లలో ముసాయిదా ఓటరు జాబితాలో వచ్చాయి. దీంతో బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీవోకు, తహసీల్దార్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఎవరుంటే వారికే అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే ఇరుకుల్లలో నమోదైన పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ రాజేష్‌ను వివరణ కోరగా ఈ రెండు పేర్లను తొలగిస్తూ ఆర్డీవోకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షుడు గోపాల్, బీజేవై మండల అధ్యక్షుడు రమేష్, కిషోర్, మోర్చా మండల అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, మండల లీగల్‌టీం కన్వీనర్ అనిల్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని శాతవాహన విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేపట్టింది. సంఘం అధ్యక్షుడు కిషోర్, ప్రధానకార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సారార్ ప్రభుత్వ అటనామస్ డిగ్రీ కళాశాలలోని సీపీఎస్ అధ్యాపకులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

ప్రపంచం గర్వించే బీమా సంస్థ ఎల్ఐసీ

భగత్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించే అత్యుత్తమ బీమా సంస్థ ఎల్ఐసీ అని కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శివ నాగప్రసాద్ అన్నారు. ఎల్ఐసీ 69వ ఆవిర్భావ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక డివిజనల్ కార్యాలయంలో సంస్థ జెండాను సోమవారం ఆవిష్కరించారు. సంజీవని వైద్యశాల ప్రముఖ గైనకాలజిస్టు విజయలక్ష్మి, మార్కెటింగ్ మేనేజర్ సోమశేఖర్, సేల్స్ మేనేజర్ రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు జైలుకు వెళ్లక తప్పదు



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి నుంచి తప్పించు కునేందుకు బీఆర్ఎస్ నాయకులు ఎన్ని డ్రామాలు చేసినా చివరికి జైలుకు వెళ్లక తప్పదని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని అమరవీరుల స్థూపానికి సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానేరు డ్యాం నీళ్లు తీసుకొచ్చి కాళేశ్వరం జలాలంటూ అమరవీరుల స్థూపంపై చల్లి బీఆర్ఎస్ నాయకులు అమరవీరులను అవమానపరిచారన్నారు. అందుకే తాము క్షీరాభిషేకంతో శుద్ధి చేశామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను ప్రభుత్వం సీబీఐకి అప్పజెప్పడంతో బీఆర్ఎస్ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు. కాంగ్రెస్ నాయకులు తాజ్, కొరివి అరుణ్‌కుమార్, సమద్ నవాబ్, వెన్న రాజమల్లయ్య, రవీందర్, అక్బర్ అలీ, సలీం, పోచయ్య, విద్యాసాగర్, చాంద్‌పాషా, నెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీలో భారీగా అవకతవకలు

గన్నేరువరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం 4వవిడత సామాజికతనిఖీలో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. మండలంలోని 16గ్రామపంచాయతీల్లో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025మార్చి 31వరకు ఉపాధి కూలీలు, మెటీరియల్స్ కలిపి మొత్తం రూ.4,64,61,662 కోట్ల రూపాయల పనులను చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధిహామీలో అవకతవకలకు పాల్పడ్డ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌లు చేసిన అవకతవకలపై డీఆర్డీవో శ్రీదర్ రూ.2,13,620లను పెనాలిటీ, రికవరీని వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఆర్‌పి తిరుపతి, ఏఈపీఆర్, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి



ఇందిరా చౌక్‌లో పాల్గొన్న వెలిచాల రాజేందర్‌రావు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వే షన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై సోమవారం నగరం లోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల బిల్లు శాసనసభలో ఆమోదం లభించడంతో బీసీలకు మంచి జరిగే సమయం ఆసన్నమైందన్నారు.

గణేశ్‌నగర్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. నంగరంలోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు.డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, మాచర్ల ప్రసాద్, మడుపు మోహన్, అహమ్మద్ అలీ, మూల రవీందర్ రెడ్డి, మహమ్మద్ ఆరిఫ్, వెన్న రాజా మల్లయ్య, లింగంపల్లి బాబు, వంగల విద్యాసాగర్, నెల్లి నరేష్, నూనె గోపాల్‌రెడ్డి, తోట అంజయ్య, కుంబాల రాజకుమార్, శ్రీరాముల రమేష్, కుర్ర పోచయ్య, జక్కని ఉమాపతి, నెల్లి నరేష్, పడిశెట్టి భూమయ్య, మాదాసు శ్రీనివాస్, చింతల కిషన్, అనిల్ కుమార్ గుప్తా, మధు, కృష్ణారెడ్డి, సతీష్, స్వప్నశ్రీ, జాఫర్, గణపతి, కరీం, మురళి, దేవేందర్, స్వామిగౌడ్, అంజనేయులు, గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న జ్వరాలు

(5వ పేజీ తరువాయి)

వైద్యులు చెబుతున్నారు. సకాలంలో డాక్టర్‌ను సంప్రదిస్తే త్వరగా నయం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

● తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతుంటాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటితోపాటు పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచకోవాలని సూచిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో పాత టైర్లు, పగిలిన గాజు వస్తువులు, పెంకులు, పాత కుండలు, విరిగిన ప్లాస్టిక్ వస్తువులు, డ్రమ్ములు, నీటి తొట్టిల్లో నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచిస్తున్నారు. మనం తీసుకునే ఆహారం పరిశుభ్రంగా ఎప్పటికప్పుడు వేడిగా ఉండేలా చూసుకోవాలని, రోడ్లపై, డ్రైనేజీల ప్రక్కన అమ్మే ఆహార పదార్థాలను తీసుకోకూడదని సూచిస్తున్నారు.

'త్రివేణి' కవితా సంకలనం ఆవిష్కరణ



కవితా సంకలనం ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు రాజేశం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): సరళమైన మూడు పంక్తుల్లో జీవన తాత్వికతను ఆవిష్కరించిన నవ్య కవిత్వం వారాల ఆనంద్ రాసిన 'త్రివేణి' అని పలువురు సాహితీవేత్తలు అన్నారు. సోమవారం నగరంలోని కార్ఖానాగడ్డ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 'త్రివేణి కవితా సంకలనాన్ని రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు ఉడుతల రాజేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగాయమునా నదుల్లా మొదటిరెండు పంక్తులు ప్రవహిస్తే మూడోపంక్తి సరస్వతిలా ప్రవహించిందన్నారు. సాహితీ విమర్శకురాలు కల్వకుంట్ల శ్రీలత, సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రముఖ వైద్యుడు చంద్రశేఖర్, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, డాక్టర్ నలిమెల బాస్కర్, కెఎస్ అనంతాచార్య, పీఎస్‌రవీంద్ర, సంకెపెల్లి నాగేంద్రశర్మ, శ్రీనివాస శర్మ, పొయెట్రీ ఫోరం కన్వీనర్ ఇందిరారాణి, మంగారి శివప్రసాద్, నడిమెట్ల రామయ్య పాల్గొన్నారు.

వాగేశ్వరిలో జాతీయ క్రీడా దినోత్సవం

తిమ్మాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్ఎస్ వారు సంయుక్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని మూడురోజులపాటు నిర్వహించినట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ గండ్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ జేడీగా డాక్టర్ లింగారెడ్డి

కరీంనగర్ సెప్టెంబరు 1 (అంధ్రజ్యోతి ప్రతినిధి): పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎస్ లింగారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లింగారెడ్డి ప్రస్తుతం ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ శిక్షణా కేంద్రంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన లింగారెడ్డికి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ మారనున్న నందెల్లి ప్రకాశ్?

భగత్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు, రేకుర్తి మాజీసర్పంచ్ నందెల్లిప్రకాశ్ పార్టీ మారనున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌ఉమ్మడిజిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ప్రకాశ్ 2009స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై జడ్పీటీసీగా పోటీచేసి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్నారు. స్థానిక శాసన సభ్యుడు గంగుల కమలాకర్‌కు అనుచరుడిగా కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుతరాజకీయ పరిస్థితుల దృష్ట్యా పార్టీ మారే ఆలోచనను తన అనుచరుల ముందు ఉంచినట్లు తెలిసింది. ఇప్పుడున్న పరస్థితుల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీ రెండింటిలో ఒక దానిలో చేరాలని తన అనుచరుల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పేదలగుండెల్లో నిలిచిన గొప్పనాయకుడు సురవరం

చిగురుమామిడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదలగుండెల్లో నిలిచిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందెస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రాంలోని బస్టాండ్ ఆవరణలో ఆయనచిత్రపటంవద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మరెడ్డి, బూడిద సదాశి, గూడెం లక్ష్మి, మావురపురాజు, రాకం అంజవ్వ, తెరాల సత్యనారయణ, ముద్రకోల రాజయ్య, బందెల శ్రీనివాస్, తాళ్లపెల్లి చంద్రయ్య, పైడిపల్లి శశికుమార్, ఉస్మాన్ పాషా, అందె తిరుపతి, గోళి బాపురెడ్డి, మంద ఎల్లయ్య, ఎలగందుల రాజు, బొట్ల పోచయ్య, పైడిపల్లివేంకటేశంతోపాటు అన్నిగ్రామాలకార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హుజూరాబాద్, సెప్టెం బరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన బీసీకమిషన్ మాజీఛైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ రావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని పార్టీలో చేరినట్లు కృష్ణమోహన్‌రావు తెలిపారు.

పద్మనగర్ జంక్షన్ పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని పద్మనగర్ జంక్షన్‌పనుల్లో జరిగిన అక్రమాలపై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి మాజీ కార్పొరేటర్ బండారి వేణు పిర్యాదు చేశారు. ఎటువంటి వర్క్ స్లిప్‌లేకపోవడమే కాకుండా సరైన ఎస్టిమేషన్ లేకుండా పనులు ప్రారంభించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో మాధవ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అయినప్పటికి తిరిగి వారికే పనులు ఎలా ఇచ్చారని పేర్కొన్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు

మానకొండూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ పీహెచ్‌సీలో సోమవారం రెండు సాధారణ ప్రసవాలు అయ్యాయి. బీహార్‌కు చెందిన కాజల్-అఖిలేష్ అనే దంపతలకు ఇప్పటికే ఐదుగురు అమ్మాయిలు. ప్రస్తుతం వీరికి సోమవారం నాలుగు కిలోల బాలభీముడు జన్మించారు. రాజస్థాన్‌కు చెందిన తారగుర్జార్‌కు పురిటినొప్పులు రావడంతో పీహెచ్‌సీకి తీసుకరాగా మధ్యాహ్నం 3.30కిలోల బాబుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. డాక్టర్ ఎండీ సల్మాన్, సీహెచ్‌వో రాజ్‌నాయక్ ఉన్నారు.

శంకరపట్నం: మండలంలోని పీహెచ్‌సీలో డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో లలిత్ సారంగ్ అనే మహిళకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్

చిగురుమామిడి,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపడం చారిత్రాత్మకం అని బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీజడ్పీ ఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూబీసీరిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వనిదే అని అన్నారు. స్థానికసంస్థలఎన్నికల్లో50శాతం రిజర్వేషన్ల పరిమితిని పంచాయతీరాజ్ చట్టం 2018సెక్షన్285(ఏ) సవరణచేస్తే బిల్లుకు ఆమోదం తెలిపిన కాంగ్రెస్‌ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కేంద్రప్రభుత్వం బీసీ బిల్లును పెండింగ్‌లో పెట్టిందన్నారు. రానున్నకాలంలో బీజేపీకి బీసీల ప్రతాపం చుపిస్తామని హెచ్చరించారు. బీసీరిజర్వేషన్ల బిలుల అమలయ్యేదాక ఎంతటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో రాజ్‌కుమార్, శ్రీనివాస్, అనిల్, సందీప్, అరుణ్ పాల్గొన్నారు.

ముద్దసాని రమేష్ రెడ్డి జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి జన్మదిన వేడుకలను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ప్రసాదం అందజేశారు. బీసీ జేఏసీ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, దొగ్గలి శ్రీధర్, మియాపూర్, రవీంద్రచారి, బత్తుల మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపానికి జలాభిషేకం



జలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ప్రతులను దహనం చేస్తున్న రసమయి బాలకిషన్





జలాభిషేకం చేస్తున్న మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్, టౌన్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాల పాలనను ఆపేసి ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. నగరంలోని అమరవీరుల స్తూపానికి సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వర ప్రదాయినని, తెలంగాణ రైతాంగానికి అన్నపూర్ణగా నిలిచిందని అన్నారు. మాజీ గ్రంథాలయసంస్థ ఛైర్మన్ అనిల్‌కుమార్, రవీందర్, మాజీ ఎంపీపీ శ్రీలత, మహేశ్‌గౌడ్, తిరుపతినాయక్, ఐలెందర్, సంపత్ ఉన్నారు.

తిమ్మాపూర్: కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ గోష్ కమిటీ ఇచ్చిన నివేదిక తప్పుల తడకని, అది పీసీ గోష్ కమిషన్ కాదని, పీసీసీ కమిషన్ అని మానకొండూర్ మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎద్దేవ చేశారు. సోమవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో అమరవీరుల స్థూపానికి ఎల్ఎండీ నుంచి బిందెలతో నీళ్ల తీసుకువచ్చి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో కింద ఉన్న నీళ్ల పైకి పారించిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని కొనియాడారు. అనంతరం పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను దహనం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, మండల అధ్యక్షుడు రావుల రమేష్, నాయకులు మాతంగి లక్ష్మణ్, అశోక్ రెడ్డి, సిద్దం వేణు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని అసత్యప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిన్నముల్కనూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేశారు. సింగిల్ విండో ఛైర్మన్ జంగ వెంకటరమణరెడ్డి, వైస్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సాంబారి కొమురయ్య, కత్తుల రమేష్ యాదవ్, పెసరు రాజేశం, పెనుకుల తిరుపతి, సద్దింకి రాయమల్లు, తిరుపతిరెడ్డి, అయిమాండ్ల సత్యనారాయణ, ఎండీ సర్వర్ పాషా, గుంటి తిరుపతి, ముప్పిడి వెంకటనర్సింహారెడ్డి, మాజీసర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రామడుగు: రాష్ట్ర సాగునీటిరంగ ముఖచిత్రాన్నే కాళేశ్వరం ప్రాజెక్టు మార్చివేసిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని తిర్మలాపూర్‌లో గోదావరి నీళ్లతో తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, నాగి శేఖర్, తౌటు మురళి, తడగొండ రాజు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని కాళేశ్వరం నీళ్లతో శుభ్రం చేశారు.